క్లుప్తంగా

ఘనంగా పశలమ్మ పండుగ



అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

వేపాడ: మండలంలోని చామలాపల్లిలో పశలమ్మ పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది వరినాట్లకు ముందువారం పశలమ్మకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని శతకం పట్టు నుంచి అమ్మవారిని ఊరేగింపుగా పశలమ్మ ఆలయం వద్దకు చేరుకుని, అమ్మవారికి ముర్రాటలు, పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు.

ప్రమాదకరంగా వంతెన



వంతెనకు రెండువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

జామి: మండలంలోని అలమండ రహదారిపై గల వంతెన ప్రమాదకర స్థితికి చేరుకుంది. పిచ్చి మొక్కలు, రకరకాల తీగలు వంతెనను అల్లుకోవడంతో వాహనదారులకు వంతెన సక్రమంగా కనబడడం లేదు. పైగా చిన్న దారి కావడంతో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు రెండు వైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ భగవద్గీత



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు, తదితరులు

శృంగవరపుకోట: భగవద్గీత పఠనం ప్రతి భారతీయుని కర్తవ్యం కావాలని.. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటికీ భగవద్గీత చేరాలని స్థానిక మోక్షవిద్య యోగామందిర్ నిర్వాహకులు అన్నారు. ఆదివారం సాయంత్రం సంస్థ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని శ్రీనివాసకాలనీలో భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు శీలా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పుస్తకాలు కావాల్సిన వారు 99893 68781, 98667 57311 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో దాడ్రాజు, పెదకాపు, సంతోష్, మణికంఠ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోజంతా చిరుజల్లులే..



అరకు - విశాఖ రోడ్డులో కురుస్తున్న చిరుజల్లులు

లక్కవరపుకోట /కొత్తవలస: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా లక్కవరపుకోట, కొత్తవలస మండలాల్లో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరజల్లులు కురిశాయి. దీంతో వాహనదారులు, పాదచారులు, చిరువ్యాపారలు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఈ వర్షం వరినారు పోసుకోవడానికి ఇబ్బందిగా మారిందని రైతులు చెబుతున్నారు.

రెండు పశువుల వ్యాన్లు సీజ్



ఎస్.బూర్జవలస స్టేషన్ వద్ద పట్టుబడిన వ్యాన్‌లో ఉన్న పశువులు

దత్తిరాజేరు: అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వ్యాన్‌లను సీజ్ చేసినట్లు పెదమానాపురం, ఎస్.బూర్జవలస ఎస్సైలు ఆర్.జయంతి, జి.రాజేష్ తెలిపారు. ఆరు పశువులతో పార్వతీపురం నుంచి వైజాగ్ వెళ్తున్న వ్యాన్‌ను పెదమానాపురం పోలీస్‌స్టేషన్ వద్ద.. తొమ్మిది పశువులతో ఉన్న వ్యాన్‌ను ఎస్. బూర్జవలస స్టేషన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. పశువుల యజమానులు, వ్యాన్ డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖరీఫ్‌కు నీరందేనా...?

- తోటపల్లి కాలువ పనులు ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- గజపతినగరం బ్రాంచ్ కాలువకు కలగని మోక్షం
- ఆందోళనలో అన్నదాతలు



అప్పటి ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకం



చుక్కపేట వద్ద గతంలో జరిగిన కాలువ పనులు(ఫైల్)

దత్తిరాజేరు: సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తొటపల్లి ప్రాజెక్ట్ కుడి కాలువ నుంచి గజపతినగరం బ్రాంచ్ కాలువ ద్వారా 15,376 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు గతంలో అధికారులు ప్రతిపాదించారు. సంబంధిత పనులు చేపట్టేందుకు 15 ఏళ్ల కిందట 2009 ఫిబ్రవరి 20న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దత్తిరాజేరు మండలం పెదమానాపురం సంత తోట వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రధాన కాలువతో పాటు గుర్ల మండలం కొండగంద్రేడు వద్ద వంతెన నిర్మాణం పనులు మాత్రమే జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 40 పిల్ల కాలువుల తవ్వకానికి ప్రతిపాదనలు చేసి భూసేకరణకు సన్నాహాలు చేసింది. చీపురుపల్లి నుంచి అగ్రహారం వరకు 1.5 కిలోమీటర్ల కాలువకు కాంక్రీట్ పనులు చేయాలి. అలాగే మొరకముడిదాం మండలంలో ప్రధాన కాలువ పనులు కూడా చేయాల్సి ఉంది. కొండగంద్రేడు వద్ద కొండ అడ్డురావడంతో దానికి మరలా ప్రత్యామ్నాయ పనులు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి అడుగులు వేయడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కాలువ పనులు పూర్తి చేయకపోవడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగునీరు అందాల్సిన ప్రాంతాలు, భూమి విస్తీర్ణం

మండలం	గ్రామాలు	ఎకరాలు
దత్తిరాజేరు	10	4,180
గజపతినగరం	17	6,516
మొరకముడిదాం	06	2,109
గుర్ల	05	2,571
గరివిడి	03	1,198

అంచనాలు తయారు చేశాం..

గజపతినగరం బ్రాంచ్ కాలువకు పనులకు సంబంధించి అంచనాలు తయారుచేశాం. రూ. 137 కోట్లతో అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఎక్కడ పనులు చేయాలో ప్రణాళికలు తయారుచేస్తాం.

– ఉషారాణి, డీఈఈ, గజపతినగరం బ్రాంచ్ కెనాల్ కాలువ

పనులు జరిగేనా..!



ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పటివరకు కాలువ పనులు చేపట్టకపోవడం దారుణం. కూటమి ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది అనుకున్నాం. కాని తోటపల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించి గజపతినగరం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేయలేదు.

– మజ్జి శ్రీనివాసరావు, రైతు, ఎం. లింగాలవలస

ప్రతి ఏటా నీటి ఇబ్బందులే..



తొటపల్లి ప్రాజెక్ట్ నుంచి గజపతినగరం బ్రాంచ్ కాలువ ద్వారా మా పొలాలకు సాగునీరు అందిస్తామంటే అప్పట్లో సంబరపడిపోయాం. మా బతుకులు మారుతాయని ఆనందించాం. కాని ఇన్నేళ్లు గడిచినా కాలువ పనులు పూర్తి కాలేదు. ప్రతి ఏటా నీటి కష్టాలు తప్పడం లేదు.

– గురుబిల్లి ఆదినారాయణ, రైతు, పెదమానాపురం

జిందాల్ నిర్వాసితుడిపై దాడి



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, పక్కనే ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల పోరులో కొత్త సంఘటనలు పరిస్థితుల్ని మరింత జఠిలం చేస్తున్నాయి. మండలంలోని ముషిడిపల్లికి చెందిన ముత్యాల సన్యాసిరావు అనే వ్యక్తిపై శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డ సంఘటన స్థానికంగా సంచలనమైంది. సంఘటనపై బాధితుడు సన్యాసిరావు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ రఘురాజుతో కలిసి విశాఖలో లాయర్‌ను కలిసేందుకు శనివారం వెళ్లి, మాట్లాడిన తర్వాత రాత్రి 12 గంటల సమయంలో బొడ్డవరలోని రాజుగారి నివాసానికి చేరామన్నారు. అక్కడి నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. తాటిపూడి రోడ్డులో గల జిందాల్ కార్యాలయానికి 200 మీటర్ల దూరంలో మంకీ క్యాప్‌లు పెట్టుకున్న ముగ్గురు వ్యక్తులు బైక్ ఆపి తాళాలు లాక్కుని తనపై పిడిగుద్దులు కురిపించారని చెప్పారు. జిందాల్ పోరాటం ఆపకపోతే నీ భార్యాబిడ్డలుండరని.. నీ వెనుకున్న ఎమ్మెల్సీ అంతుచూస్తామని హెచ్చరించారని తెలిపారు. తనను వదిలేయాలని వేడుకోవడంతో వెళ్లిపోయారన్నారు. వెంటనే గ్రామానికి వెళ్లి 15 మంది కుర్రాళ్లను తీసుకుని తిరిగి వచ్చి అదే ప్రాంతంలో గాలించినా ఎవ్వరు కనిపించలేదని చెప్పారు. అదేరోజు రాత్రి డయల్ 100కు ఫోన్ చేసి విషయం తెలియజేశామని, ఆదివారం ఉదయం కుటుంబ సభ్యుల సహకారంతో ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో చేరానని తెలిపారు. దళితుడినైన తనపై జరిగిన దాడి విషయంలో హోమ్ మినిస్టర్ అనిత, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, తదితరులు సన్యాసిరావును ఆదివారం పరామర్శించారు.

దాడులతో పోరాటం ఆపలేరు..

నిర్వాసితులు శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని దాడులతో ఆపలేరని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. జిల్లాలో ఇంతవరకు లేని కొత్త సంస్కృతికి తెర తీస్తున్నారని.. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు బాధితులకు అండగా ఉండాలని కోరారు. రైతులు తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని అడుగుతున్నారే తప్ప కంపెనీలు పెట్టుకోవద్దని చెప్పడం లేదన్నారు. ప్రశాంతమైన జిల్లాలో ఫ్యాక్షన్ సంస్కృతిని స్వాగతిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. బాధితుని కుటుంబానికి రక్షణ కల్పించాలని, నిర్వాసితుల్లో ఎవరికి ప్రమాదం జరిగినా కలెక్టర్, ఎస్పీలు బాధ్యత వహించాలన్నారు.

పూర్తికాని సామాజిక భవనం



అసంపూర్తిగా దర్శనమిస్తున్న సామాజిక భవనం

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో సామాజిక భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. గతంలో బొత్స ఝాన్సీ ఎంపీగా ఉన్నప్పుడు ఈ సామాజిక భవనానికి నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. అయితే నిధులు చాలకపోవడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వాలు మారినా సామాజిక భవనం గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. సామాజిక భవనం పక్కనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు నిర్మించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భవనాలను ప్రారంభించారు. ఆ సమయంలో గ్రామస్తులు సామాజిక భవనానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని కోరగా.. మంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాని ఇంతవరకు నిధులు మంజూరు కాకపోవడంతో భవనం దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. మంత్రి గారు కాస్త దయ చూపి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

• కృతజ్ఞతలు..



మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేస్తున్న వెంకటరమణ, తదితరులు



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వెంకటరమణ, తదితరులు

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ వింగ్ సెక్రటరీగా మండలంలోని బోనంగి గ్రామానికి చెందిన పట్నాన అప్పల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు గజపతినగరం మాజీ శాసనసభ్యుడు బొత్స అప్పలనరసయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)లను ఆదివారం కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల అధ్యక్షుడు జాగారపు అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి ఫీడర్‌లో కొత్త బే ఎక్స్‌టెన్షన్ పనులు చేపట్టనున్నందున ఎస్.కోట పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, బర్మాకాలనీ, వైఎస్సార్ కాలనీ, పుణ్యగిరి రోడ్డు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



భానులత

కొత్తవలస: వ్యవసాయశాఖ కొత్తవలస సబ్ డివిజన్ ఏడీఏగా బి.భానులత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎల్.విజయ శ్రీకుళానికి బదిలీపై వెళ్లిపోయారు. ఆమె స్థానంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రంలో ఏడీఏగా పనిచేస్తున్న భానులత ఇక్కడకు వచ్చారు. అలాగే లక్కవరపుకోట మండల ఏఓగా వి.హరికృష్ణ, కొత్తవలస ఏఓగా రాంప్రసాద్, జామి ఏఓగా పూర్ణిమ, వేపాడ ఏఓగా స్వాతి బాధ్యతలు స్వీకరించినట్లు ఏడీఏ భానులత తెలిపారు. డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సుమారు 7,800 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి: వారంతా 25 ఏళ్ల కిందట చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు. పాఠశాల చదువుల అనంతరం ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇరవై ఐదేళ్ల తర్వాత ఆదివారం వారంతా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఎవరెవరు ఏం చేస్తున్నారు.. ఎక్కడ స్థిర పడ్డారో అడిగి తెలుసుకుని సందడిగా గడిపారు. చదువుకున్నప్పుడు చేసిన అల్లర్లు, ఆటపాటలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో గవిడి సురేష్, రెడ్డి ఆనంద్, కింతలి నరేష్, మనోజ్, పిల్ల శ్రీనివాస్, సూరిబాబు, ధనుంజయ్, తిలక్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా వేపాడ ప్రధాన రహదారి



వేపాడ రోడ్డులో నీటితో నిండిపోయిన గుంతలు

వేపాడ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని అభివృద్ధి చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి వర్షం కురవడంతో గుంతల్లో నీరు చేరింది. దీంతో దిచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సోంపురం - వేపాడ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా వేపాడలో మెయిన్ రోడ్డులో అరుగులు, శ్లాబ్‌లు తొలగించి ఏడాది దాటిపోయినా కాలువలు నిర్మించలేదు. దీంతో వాడుక నీరు, వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. మండల స్థాయి అధికారులు, పాలకులు ఇదే రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని మండల వాసులు అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాసమహర్షి అవార్డుకు చంద్రరావు ఎంపిక



చంద్రరావు

గజపతినగరం రూరల్: నైతిక విలువలతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మిక విలువలతో కూడిన బోధన అందిస్తున్న మండలంలోని మర్రివలస ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన కనకల చంద్రరావు ప్రతిష్టాత్మక వ్యాసమహర్షి అవార్డుకు ఎంపికయ్యారు. గుంటూరుకు చెందిన జాతీయ హిందూ ఉపాధ్యాయ సమితి జూలై 13న బాపట్లలో ఈ అవార్డు అందించనుంది. ఈ మేరకు సంస్థ నుంచి చంద్రరావుకు ఆహ్వానం అందింది. సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు చంద్రరావుకు అభినందనలు తెలియజేశారు.

పల్లిగంద్రేడులో మన్‌కీబాత్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ఆలకిస్తున్న బీజేపీ నేతలు, గ్రామస్తులు

గుర్ల: మండలంలోని పల్లిగంద్రేడులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ దేశ అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు, మండల అధ్యక్షుడు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వితరణ



ఉపాధ్యాయులు అందజేసిన కుర్చీలు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలల నుంచి బదిలీపై వచ్చిన పలువురు ఉపాధ్యాయులు పాఠశాలకు కుర్చీలు, బెంచీలను వితరణగా ఆదివారం అందజేశారు. పాఠశాలకు బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు, బి.జ్యోతి, జి.హరికృష్ణ, పట్నాలు, బి.సత్యారావు, గంగాభవానీ, ఉనీషా, నవీన్ రూ. 20,000 విలువైన పది కుర్చీలు, లాంగ్ బెంచీలు అందజేసినట్లు హెచ్ఎమ్ బీవీఏ రాజు తెలిపారు. అలాగే సోంపురంలో పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవిశంకర్, గౌరి, విజయభవానీ విద్యార్థులకు పదివేల రూపాయల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, తదితర స్టేషనరీ సామాన్లు అందజేశారు.

లారీ బోల్తా

• తప్పిన పెనుప్రమాదం



బోల్తా పడిన లారీ

జామి: మండలంలోని అలమండ గెడ్డపై ఉన్న వంతెనపై నుంచి లారీ బోల్తా పడింది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం నుంచి స్క్రాప్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న లారీ శనివారం తెల్లవారుజామున అదుపు తప్పి వంతెన పైనుంచి గెడ్డలోకి బోల్తాపడింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆదర్శవంతమైన మార్కెట్ కమిటీగా తీర్చిదిద్దండి

గజపతినగరం: గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీని జిల్లాలో ఆదర్శవంతమైన కమిటీగా తీర్చిదిద్దేందుకు నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఏఎంసీ నూతన చైర్మన్‌గా పీవీవీ గోపాలరాజు, వైస్ చైర్మన్‌గా కోరాడ కృష్ణలతో పాటు సభ్యులుగా మరికొంతమంది ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సమక్షంలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, ప్రదీప్ కుమార్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుమీదే మురుగునీరు



రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి గేదులవానిపాలెం మీదుగా అలమండ వెళ్లే రోడ్డులో గోల్డ్‌స్టార్ జంక్షన్ కాలనీ వద్ద రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉంటోంది. ఇటీవల రూ. 30 లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టినా, మురుగునీరు నిల్వ వల్ల గోతులేర్పడ్డాయి. కాలనీవాసుల వాడుకనీరు రోడ్డుమీదుగానే ప్రవహిస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అనుకుని కాలువలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.